# 6

# క్రైస్తవ జీవన విధానంలోని మాధుర్యం

## (ఎఫెసీయులకు 4:17-32)

“ధనికులు మరియు ప్రముఖుల జీవనశైలి” అన్న టి. వి కార్యక్రమం 1984లో ప్రసారం చేయబడింది. జనుల జీవితాలను పరిశీలించడం అన్న ఆలోచన ఎంతో ప్రాచుర్యం పొందింది. నేను ఒకసారి యూరప్‌లో ఉండగా రష్యాలోకూడా ఇటువంటిది కార్యక్రమమే ప్రసారం చేయబడడం చూశాను. దీన్ని బట్టి ఇతరులు ఎలా జీవిస్తున్నారన్న విషయాన్ని గమనించడం ప్రజలకు ఆసక్తి అని అర్థమయ్యింది. మానవ సహజ ఉత్సుకతతో మనం ఇతరులు ఎలా ఉన్నారు, ఎలా మాట్లాడుతున్నారు, ఎలాంటి వస్త్రధారణ చేసుకున్నారు, ఎలా ప్రవర్తిస్తున్నారు అన్ని విషయాలు పరిశీలించేందుకు ఆసక్తి చూపుతాము.

క్రైస్తవ జీవన విధానం ఎంతో ప్రధానమైనది. ఎందుకంచే, సంఘంలోని వారు ఎలా జీవిస్తున్నారన్న విషయాన్ని ఇతరులు గమనిస్తున్నారు (మత్తయి 5:13-16; 1 పేతురు 2:11, 12). క్రీస్తును అనుసరించే వారికి జీవించడంలో ఎంతో గొప్ప బాధ్యత ఉంది. తమ జీవితం ద్వారా క్రైస్తవులు, క్రైస్తవేతరుల మధ్య తేడాను ఇతరులు సులభంగా గుర్తించగలుగుతారు. ఈ బాధ్యతను ఒక బోధకుడు ఇలా చెప్పాడు – క్రైస్తవుడంటే “బూటు తోలులో ఉండే సువార్త వంటివాడు.” (దీనర్థం, క్రైస్తవుని జీవనశైలి, అతని ప్రతి దిన జీవనం ద్వారానే అనేకమంది సువార్తను అర్థంచేసుకుంటారు అని.) కొరింథులోనున్న క్రైస్తవులకు పౌలు పత్రికను వ్రాస్తూ, వారు అందరి చేతను చదువబడే “పత్రికల” వంటివారు అని చెప్తున్నాడు (2 కొరింథీయులకు 3:1, 2). ఇది ఆలోచించ దగ్గ విషయం, ప్రజలు మీ జీవన శైలిని గమనించినప్పుడు, వారు ఏం చూస్తున్నారు? ఇతరులు మీ ప్రవర్తన, మాట, వస్త్రధారణ, వ్యవహారశైలిని చూసినప్పుడు, వారు మీ నుండి ఏం చదువుతున్నారు?

“మనం చూసే ప్రసంగాలు” అన్న పద్యం క్రైస్తవ జీవన విధానం యొక్క ప్రాముఖ్యతను చెప్తుంది. ఆ పదాలు ఎఫెసీయులకు 4:17-32లో పౌలు చెప్పిన జీవనశైలిని అనుసరించియున్నాయి. ఆలోచన పూర్వకంగా దీన్ని చదవండి. దీని సందేశాన్ని గమనించండి:

> ఏ రోజైనా నేను ప్రసంగాన్ని వినడం కంటే చూస్తాను;
> నాకు మార్గం బోధించే కంటే దానిలో నాతోపాటు నడువమని చెప్తాను.
> చెవులకంటే కళ్ళే మంచి ప్రజలు,
> మంచి ఆలోచన గంధరగోళంగా అన్పిస్తుంది కానీ మాదిరి స్పష్టంగా ఉంటుంది;
> అందరు బోధకుల కంటే వారి విశ్వాస ప్రకారం జీవించే బోధకులే ఉత్తములు,
> ప్రతి వారికి కావల్సింది ఒక్కటే, సత్యమును ఆచరణలో పెట్టడం.
>
> నువ్వు దాన్ని చేయడం నాకు చూపిస్తే నేను త్వరగా నేర్చుకుంటాను;
> నీ చేతుల పనిని నేను చూడగలను, కానీ దానికంటే వేగంగా నీ నాలుక ఉంది.

నీవు చెప్పిన హితవు, బోధ ఎంతో జ్ఞానంగా, సత్యంగా ఉంది,
కానీ నిన్ను పరిశీలించడం ద్వారానే నేను ఎక్కువగా నేర్చుకుంటున్నాను;
నీవిచ్చిన ఉన్నత సలహాను, నిన్ను నేను అపార్థం చేసుకొంనేమో కానీ,
నీవు చేసే పనులను, నీ జీవితాన్ని ఎలా జీవిస్తున్నావో చూసి అపార్థం చేసికోలేను.[1]

ఒకరి గురించిన ప్రాముఖ్యతను వాక్యం ప్రధానంగా చెప్తుంది (ఫిలిప్పీయులకు 2:15; 1 థెస్సలొనీకయులకు 1:7, 8; 1 తిమోతి 6:1). మార్పు జీవితాన్ని జీవించడం గురించి ఎఫెసీయులకు 5:8–6:9లో మరోసారి నొక్కి చెప్పబడింది.

ఎఫెసీయులకు 4:17–32లో, క్రైస్తవ జీవన విధానం వివరంగా చెప్పబడింది. ఒకవ్యక్తి క్రైస్తవుడు కాకముందు జీవించిన విధానం మరియు క్రైస్తవుడైన తరువాత జీవించిన విధానం మధ్య గల సుస్పష్ట వ్యత్యాసం ఇక్కడ కనబడుతుంది. ఈ వాక్య భాగం ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఎందుకంటే, క్రైస్తవులు తమ జీవితంలోని ప్రతి విషయంలోనూ లోకం కంటే భిన్నంగా ఉంటారని తెలియజేస్తుంది. నూతన క్రైస్తవుడు తన చుట్టునున్న వారికంటే తాను నిజంగా భిన్నమైన వాడినని గుర్తించేలా పౌలు మాటలు సహాయం చేస్తున్నాయి. ఈ వ్యత్యాసం క్రైస్తవ్యపు ఆనందాన్నిస్తుంది. నూతన క్రైస్తవుడుగా నీవు ఆనందం కలిగిఉండాలి. ఎందుకంటే నిత్య ఆశీర్వాదాలను ఇచ్చే దైవిక జీవన విధానాన్ని మీరు ఎంచుకున్నారు. దేవుడాశించిన విధంగా జీవిస్తున్నానన్న తృప్తి కంటే ఒకరికి మరేదీ గొప్పగా ఉండదు. పరిశుద్ధంగా జీవించడంలోనున్న ఈ వ్యత్యాసం క్రైస్తవునికి ఆనందాన్నిస్తుంది (తీతు 2:11–14; 3:1–8).

ఎఫెసీయులకు 4:17–32లో ఇయ్యబడిన క్రైస్తవ జీవన విధనంలోని మాధుర్యపు వర్ణనను గమనించండి. దేవుని పిల్లలుగా మీరు దుర్మార్గం, చెడుతనం నిండిన ఈ లోకంలోకి మాధుర్యాన్ని ఆనందాన్ని తీసుకు వస్తున్నారు. మీ జీవన విధానం ఈలోకంలో మాధుర్యంగా ఎందుకు చెప్పబడింది? ఈ ప్రశ్నకు సమాధానం ఈ వాక్యంలో దొరుకుతుంది.

## వ్యత్యాసాల జీవితము (4:17–19)

ఒక వ్యక్తి జీవిస్తున్న విధానాన్ని తెలియజేయుటకు "నడచుకొనుట" అను అలంకార పదం ఇక్కడ వాడబడింది. సామెతల గ్రంథంలో "యథార్థత," "నీతి" అను మాటలను "నడుచుట" అను మాటతో కలిపి చెప్పబడింది (2:7, 13, 20). జీవన విధానాన్ని తెలియజేసేందుకు ఎఫెసీ పత్రిలో "నడచుట" అను పదం ఎక్కువగా వాడబడింది (4:1, 17; 5:2, 8, 15). ఇప్పటి సామెత ఒకటి ఇలాంటి పదాన్ని వాడుతుంది: "*నీనడత నీ మాటను పోలియుండాలి.*" ఇలాంటి పద ప్రయోగం అనేక భాషల్లో కనబడుతుంది. ఇది చెప్పే మాటను బట్టి మన ఆత్మీయ నడత కూడా ఉండాలి అన్న అర్థాన్ని ఇస్తుంది. ఈ బోధ 17 వ వచనములో కనబడుతుంది. మీరు క్రైస్తవులయ్యారు కాబట్టి మీ నడత మీ మాటను వివరించేదిగా ఉండడం కొంచెం కష్టంగానే ఉంటుంది. మరోమాటలో చెప్పాలంటే, "మీరు క్రైస్తవులని చెప్పుకుంటే, మీ జీవన విధానం ద్వారా క్రైస్తవ్యాన్ని చూపండి" అని చెప్పడం. సువార్తకు లోబడిన వ్యక్తి మిగిలిన వారందరి కంటే భిన్నం. ఎందుకంటే అతడిప్పుడు "క్రీస్తునందు నూతన సృష్టి" (2 కొరింథీయులకు 5:17).

క్రైస్తవ జీవన విధానం లోకానికి ఎంతో వ్యత్యాసంగా కనబడుతుంది. మీరు క్రీస్తును

అనుసరిస్తున్నారు కాబట్టి, దేవునిని అనుకరిస్తున్నారు కాబట్టి మీ అనుదిన జీవితంలో భిన్నంగా ఉంటారు.

*మొదటిగా, మీరు ఆలోచిస్తున్న విధానంలో భిన్నంగా ఉంటారు* (17 వచనం). మారేకి ముందు ఒకరి ఆలోచనా విధానం దేవుడు ఆజ్ఞాపించిన విధానానికి భిన్నంగా ఉంటుంది. లోకంలో ఉన్న వ్యక్తి తన యోచనలు సరియైనవని అనుకుంటాడు కానీ అతని లోకసంబంధమైన ఆలోచనలు “వ్యర్థములు” అని వాక్యం చెప్తుంది. ఎందుకు? లోకంలో నున్న వారు దేవుని వాక్యంచే నడిపించబడాలని భావించరు. నీకు సరిపడ ఆనందం, ఆస్తులు, ఆధిక్యత, ఆధిపత్యం, ఆర్భాటం ఉంటే సంతోషంగా ఉంటావని లోకపు ఆలోచనలు చెప్తాయి. వాటిని ఎదుర్కొనే క్రమంలో లోకానుసార వ్యక్తి దేవున్ని నిర్లక్ష్యం చేసి, విడిచిపెడుతుంటారు. అయితే మీరిప్పుడు క్రీస్తునందున్నారు కాబట్టి లోకానుసారంగా మీరెన్నడూ ఆలోచించకూడదు. మీరు వాక్యాన్ని అనుసరిస్తున్నారు కాబట్టి మీ క్రైస్తవ ఆలోచనలు, క్రియలు, లక్ష్యాలు విలువైనవి!

*రెండవదిగా, మీరు అర్థం చేసుకునే విధానంలోనూ భిన్నంగా ఉంటారు* (18ఎ వచనం). లోకం ఆలోచించే విధానం తప్పు కాబట్టి ఆ ఆలోచన నుండి వచ్చిన గ్రహింపు కూడా తప్పే! “అర్థం చేసుకోవడం” అంటే “గ్రహించడం” “ఎరిగియుండడం.” మార్పుచెందని వ్యక్తి దేవుని వాక్యం జీవితపు మార్గాన్ని ఎలా నిర్దేశిస్తుందో గ్రహించలేడు. మారిన వ్యక్తి పాపపు అంధకారం నుండి బయటపడి దేవుని సత్యపు వెలుగును గ్రహించాడు.

*మూడవదిగా, దేవునితో సహవాసంలో మీరు భిన్నంగా ఉంటారు* (18బి వచనం). మార్పు చెందని వ్యక్తి దేవుని ఉనికిని అంగీకరిస్తాడు. సమస్యలు ఎదురైనప్పుడు దేవునికి ప్రార్థన చేయాలంటాడు. కానీ దేవునితో సహవాసాన్ని కలిగియుండడు. అతడు దేవునికి దూరమై ఒంటరిగా ఉంటాడు. ఇందుకు విరుద్ధంగా, మార్పు నొందిన వ్యక్తి దేవుని కుటుంబంలో జన్మించి “తండ్రిగా” పిలువగలడు (2:18బి). నూతనంగా మారిన వ్యక్తి జాగ్రత్తగా “వెలుగులో నడుస్తూ” దేవునితో ఉన్న తన సహవాసం కుటుపడకుండా చూస్తాడు (1 యోహాను 1:6–10).

*నాల్గవదిగా, మీ జ్ఞానంలోనూ మీరు భిన్నంగా ఉంటారు* (18సి వచనం). మారని వ్యక్తికి దేవుని గురించి తెలియదు, ఆయన ఎవరో తెలుసుకోవాలన్న జ్ఞానం కూడా ఉండదు. లోకం “అజ్ఞానంతో” నిండిపోయియుంది. క్రీస్తును ఎరుగని వారు, పాతనిబంధనలో యెషయా చెప్పిన ఇశ్రాయేలు వారిని పోలియున్నారు: “ఎద్దు తన కామందు నెరుగును. గాడిద సొంతవాని దొడ్డి తెలుసుకొనును. ఇశ్రాయేలుకు తెలివిలేదు నా జనులు యోచింపరు” (యెషయా 1:3). క్రైస్తవునికి దేవుని గూర్చిన జ్ఞానం ఉంది (యెషయా 37:20) దేవుని గూర్చి ఈ జ్ఞానం అతని జీవన విధానాన్ని నడిపిస్తుంది (ఫిలిప్పీయులకు 3:10).

*ఐదవదిగా, మీరు సున్నితమైన విషయాల్లో భిన్నంగా ఉంటారు* (18డి, 19వ వచనాలు). మారని వ్యక్తికి కఠిన హృదయం ఉంటుంది కానీ క్రైస్తవునికి గుచ్చబడిన హృదయం ఉంటుంది (అపొస్తలుల కార్యములు 2:36–38; KJV; ASV). లోకంలో నున్న వారు తమ స్వార్థం ఇతరులను ఎలా ప్రభావితం చేస్తుందో జాగ్రత్త కలిగియుంటాడు. మార్పుచెందిన వ్యక్తి తన నిర్ణయాలు తన పట్ల దేవుని విధానాన్ని ఎలా ప్రభావితం చేస్తున్నాయోనన్న భయం కల్గియుంటాడు. క్రైస్తవులు మరియు క్రైస్తవేతరుల సున్నితమైన విషయాల మధ్య ఎంతో వ్యత్యాసం ఉంది. తన జీవితంలోని ప్రతి విషయాన్ని దేవుడు ఎలా చూస్తున్నాడన్న

భయం గల వ్యక్తి యొక్క జీవితం ఎంత మాధుర్యంగా ఉంటుంది! అతడు జీవించే విధానం ద్వారా దేవునికి దుఃఖం కలుగకుండా అతడెంతో జాగ్రత్తపడతాడు (గలతీయులకు 6:6; ఎఫెసీయులకు 4:30).

క్రైస్తవులు మరియు క్రైస్తవేతరుల జీవన విధానముల మధ్య ఈ ఐదు వ్యత్యాసాలను చూస్తున్నాము. క్రీస్తును అనుసరించే వ్యక్తి ఆనందాన్ని పొందుతాడు. ఎందుకంటే అతడు జీవితంలో శ్రేష్ఠమైన దాన్ని ఎన్నుకొని దానికనుగుణంగా జీవిస్తున్నాడు. దైవిక ప్రాధాన్యతలను అనుసరించి జీవించేందుకు నిర్ణయించుకున్న వారిని దేవుడు ఘనపరుస్తాడు (లూకా 10:42).

## స్థిరమైన జీవితం (4:20-24)

క్రైస్తవ జీవిత విధానం నిలకడగా ఉండాలి. సత్య గ్రహింపు అనునది నిర్ణయాలను నిర్దేశించేదిగా ఉండాలి. క్రైస్తవుడగువాడు యిలా తీర్మానిస్తాడు, "మారుమనస్సు నొంది తిరుగుడి" (అపొస్తలుల కార్యములు 3:19). ఈ నిర్ణయాన్ని ప్రతి రోజూ ఆచరించాలి. "మారుమనస్సు" అనేది ఒక్కసారి జరిగేది కాదు. ఇది ప్రతి సారి జరుగుతుండాలి (1 యోహాను 1:6-9). ప్రతి రోజూ నూతన విశ్వాసి దేవుని చిత్తం గురించి నేర్చుకుంటుంటాడు. దాని ఫలితంగా ప్రతి దినము కొంత మార్పు కలుగుతుంది.

క్రైస్తవ జీవన విధానంలోని వృద్ధి, దుస్తులు మార్చుకోవటడంతో పోల్చబడింది. నూతనంగా మార్పుచెందిన వాడు పాత వాటిని తీసివేసి క్రొత్తవాటిని వేసుకుంటాడు. మరోసారి స్పష్టంగా గమనించండి: పాతవాటిని తీసివేసి నూతనమైన వాటిని పొందడం, ఈ వాక్య భాగంలో మూడు ప్రధాన పదాలున్నాయి: "తీసివేయడం" ("వదులుకొని"; KJV), "ధరించడం" మరియు "నూతన పరచబడడం." "తీసివేయడం" మరియు "ధరించడం" గ్రీకు భాషలో అకాల క్రియా పదాలు. ఇవి పూర్తయిన పనిని చూపిస్తున్నాయి. ఒకటి పూర్తయిన తరువాత దాన్ని మరలా చేయనక్కర్లేదని వాక్యం చెప్తుంది. "నూతనపరచబడడం" అన్న పద మూలం గ్రీకులో వర్తమానకాల క్రియను చూపుతుంది. అంటే జరుగుతున్న పనిని చూపిస్తుంది. ఈ వివిధ పదాలు క్రీస్తువొద్దకు వచ్చిన నూతన విశ్వాసికి మంచి పాఠాన్ని నేర్పుతున్నాయి. క్రైస్తవుడవడం ద్వారా నీవు ఇది వరకే "తీసివేయడం" "ధరించడం" చేశావు. అంటే ఆ పని పూర్తయిపోయింది. దాన్ని మరలా చేయనక్కర్లేదు. ఇక నీ జీవితంలోని పాపాలకు నెమ్మదిగా పశ్చాత్తాపపడడం ఉండదు. ఇక దాన్ని ఆపేయాల్సిందే! అయితే నీ జీవితంలో "నూతనమవడం" మాత్రం నెమ్మదిగా జరుగుతుంది (24వ వచనం). నీవు ఒక్కసారిగా పూర్తి సారూప్యమునకు రాలేవు. మార్పు ద్వారా ఒక్కసారిగా పాపం అరికట్టబడి అక్కడ్నుంచి పరిశుద్ధతకు, సంపూర్ణతకు నడిపించే విశ్వాసంలో ఎదుగుతూ ఉంటావు!

ఈ పనికి నీవైపు నుండి ఎడతెగని క్రియలు అవసరం. నీవు నేర్చుకుంటూ, గ్రహిస్తూ వెలుగులో నడుస్తూనే ఉండాలి. అలాగే విశ్వాసంలో ఎదుగుతూనే ఉండాలి (ఫిలిప్పీయులకు 3:13-16).

## సమర్పణా జీవితము (4:25-28)

దేవుని వాక్యం నుండి నేర్చుకున్న సత్యాలను ఎడతెగక అన్వయించడం ద్వారా నూతన

క్రైస్తవునిగా సమర్పించు కుంటావు. ఇది వరకు అంధకారంలోనునప్పుడు వాడిన నడత, మాటలు, సంబంధాలు ఇక ఏమాత్రం సహించేవిగా ఉండవు. మారక ముందు ఎలా ఉండేవాడవో దానికి పూర్తి భిన్నంగా ఇప్పుడు ఉంటావు. అతడింక చెడును మాట్లాడడు; అతని జీవితంలో యథార్థత ప్రధానంగా అతడు కోపమును అదుపులో ఉంచుకొంటాడు, ప్రతి మాట ఆదరణ యిచ్చేలా జీవిస్తాడు. క్రీస్తునందున్నాడు కాబట్టి అతడు సత్యమే మాట్లాడతాడు. అతడి ఉద్దేశాలు స్పష్టంగా ఉంటాయి. అతడి యథార్థతను బట్టి గుర్తింపు నొందుతాడు. ఒకటి చెప్పి మరోటి చేయడు. అలాగే తనకు ఒక అర్థం ఎదుటి వారికి మరో అర్థాన్నిచ్చేవే ద్వంద్వార్థాలను పలుకడు. క్రైస్తవుడు అబద్ధమాడకూడదు. అతడు మాట ఇస్తే, దానికే కట్టుబడియుండాలి. యథార్థత లేని వారు నిజమైన క్రైస్తవులు కారు. వారు తీర్పు దినాన తనకు తామే బాధ్యులు (చూడండి ప్రకటన 21:8).

నమ్మకమైన క్రైస్తవుడు ఎన్నడూ సిగ్గుపడనక్కర్లేదు. ఎందుకంటే, అతడు మాట ఇస్తే అది అసత్యమని రుజువు కానేరదు. అతడు చెప్పిందే చేస్తాడు. అతడు ఏదీ దాయనక్కర్లేదు. క్రీస్తు ప్రతినిధిగా అతడు అందరిలో ఉన్నప్పుడు మరియు ఒంటరిగా ఉన్నప్పుడు కూడా ఒకేలా ఉంటాడు!

## దయార్ద్ర జీవితము (4:29-32)

క్రైస్తవ జీవన విధానం దయను, దయాళత్వమును ప్రతిబింబింపజేస్తుంది. దయను చూపించుటకు మన మాట ఒక విధానం అని పౌలు గుర్తించాడు. దేవుని సంతోషపెట్టాలనుకునే వాడు తన మాట "దేవుని పరిశుద్ధాత్మను దుఃఖపరిచేదిగా" ఉండకుండునట్లు చూసుకోవాలి. ఒక వ్యక్తి మాట మీద నిలబడకపోతే, అతని హృదయం అసత్యము చేత నడిపించబడుతుందని గ్రహించాలి. కఠినమైన మాటలు, అతడు స్వార్థంతోనున్నాడని తెలియజేస్తాయి. క్రైస్తవుని మాట "అసంపూర్ణంగా" లేదా చెడుగా ఉండకూడదు. దేవుని పిల్లల నుండి ఆశించే జీవితం దీనికి పూర్తిగా భిన్నమైనది!

నూతనముగా మారిన వాడు దయతో నడిపించబడతాడు అది కరుణకుదారి తీస్తుంది. దీని వలన క్షమించే గుణం అలవడుతుంది. ఇది క్రీస్తు ప్రభుని వైఖరి. దేవుని అనుచరునిగా, మీరు మీ మాటలలో సత్యముగానే ఉన్నారా? మీరు ఏదైనా చెప్తే ప్రజలు వింటున్నారా? ఆ మాట మీకు కష్టాలను తీసుకువచ్చినా దాని మీదనే మీరు నిలువబడతారని వారు నమ్ముతున్నారా? మీ మాట ఎంత పవిత్రంగా ఉంది? మీ మాట వింటున్న వారికి కృపను ఇచ్చేదిగా ఉందా? (చూడండి కొలొస్సయులకు 4:6.) దేవుని భక్తునిగా, మీ మాటల్లో దయ ఉందా? ఆదరణ అవసరమైన వారికి మీ మాట మృదువుగా ఉందా? మీరు దయ, కృప, మంచి, దయగలమాటలను మాట్లాడాలనుకుంటున్నారా?

వ్యాపార, రాజకీయ రంగంలో, ప్రజలు ధన సంబంధంగా కూడబెట్టుకునే మాటలు పరువు, హోదాను పెంచే మాటలు మాట్లాడతారు, కాబట్టి వాగ్దానాలు చేయడం, తరువాత అవి అసత్యాలుగా తేలిపోవడం మామూలేమీకాదు. మంచి అభినందనలూ అల్లబడతాయి. కానీ క్రైస్తవులు భిన్నంగా ఉండాలి. సత్యాన్ని స్పష్టంగా, సూటిగా, కృపాసహితంగా చెప్పాలి!

**ముగింపు విషయాలు**

మీ క్రైస్తవ జీవన విధానం ఈ లోకానికి దైవిక మాధుర్యాన్ని కలిగిస్తుంది. మీరు క్రీస్తు సువార్తలోని అమూల్యమై కృప మరియు రక్షణ సందేశము ద్వారా ఆత్మలకు దారి చూపించే దీపం వంటివారు! దేవుని ఆజ్ఞలకు విధేయులైతే మీ పాపాలు కడుగబడతాయి. మీరు ఒక జీవన విధానాన్ని తీసివేసి మరో భిన్నమైన నూతన జీవన విధానాన్ని ధరించుకుంటారు. మీరు క్రైస్తవుడైనప్పుడు (దేవుని ఆజ్ఞకు లోబడి, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొందడం) మీ జీవితాన్ని నూతనపరుచుకోవడం అన్న క్రియను ఆరంభించి క్రీస్తు యేసునందలి ఉన్నత పిలుపునకు తగిన లక్ష్యం వైపు పరుగెత్తడం ఆరంభిస్తారు. "విమోచనా దినం" కొరకు మీరు ముద్రించబడ్డారు (4:30), పరిశుద్ధతలో మీరు జీవించాలి.

ఈ చర్చను ఈ పద్యంతో ముగించడం యుక్తంగా ఉంటుంది. క్రైస్తవజీవితం దేవునికి ప్రతిష్ఠితమైనదని ఈ పదాలు వివరిస్తున్నాయి:

> మీరు ఒక సువార్తను వ్రాస్తున్నారు,
> రోజుకొక అధ్యాయము,
> మీరు చేస్తున్న పనులను బట్టి,
> మీరు పలుకుతున్న మాటలు బట్టి.
>
> మీరు వ్రాస్తున్న దాన్ని ప్రజలు చదువుతున్నారు,
> అది సత్యమా లేదా అసత్యమా అని;
> ఇప్పుడు చెప్పండి, మీ ప్రకారం
> సువార్త అంటే ఏమిటి?[2]

క్రీస్తు యేసు నందలి సువార్త రక్షణను గ్రహించునట్లుగా, అందుకు సహాయపడేలా తగినట్టు మీరు జీవిస్తున్నారా?

---

సూచనలు

[1]Edgar A. Guest, "Sermons We See," *Masterpieces of Religious Verse,* ed. James Dalton Morrison (New York: Harper & Brothers, 1948), 361. [2]Paul Gilbert, "Your Own Version," *Masterpieces of Religious Verse,* ed. James Dalton Morrison (New York: Harper & Brothers, 1948), 362.